


# పుత్రోత్సాహం

"చికుబుకు చికుబుకు రైలే, అదిరెను దీని స్టయిలే" పాట వినిపించేటప్పటికి అదిరిపడి లేచాను.

ఆఫీసు నుంచి వచ్చి స్నానం చేసి, టీ తాగి, బాలమురళి సినిమా పాటల కేసెట్ పెట్టి మంచం మీద వాలాను. ఆ పాటల హాయి అనుభవిద్దామని తీరా వింటే ఈ పాట.

టేప్ రికార్డర్‌లోంచి కేసెట్ తీసి చూశాను. 'బాలమురళి సినిమా పాటలు' అని నేను రాసిన అక్షరాలు కనిపించాయి. మరి ఈ పాటేవిటి?

మా ఆవిడను పిలిచి, అదే మాటన్నాను.

"ఏమో, నాకు తెలీదు" అంది.

ఓ క్షణంఆగి, "ఒకవేళ విజయ్ ఆ కేసెట్‌మీద ఈ పాటలు చేయించాడేమో" అంది.

"తనకి పాటలు కావాల్సి ఉంటే కొత్త కేసెట్ కొనుక్కుని చేయించుకోవాలి కానీ, నేను రికార్డు చేయించుకున్న పాటల్ని పాడుచేయడమేవిటి?"

"నా దగ్గర కోప్పడతారేం? వాడినే అడగండి".

"పిలు".

"ఫ్రెండ్స్‌తో బయటికెళ్లాడు" అంటూ మా ఆవిడ వంట గదిలోకెళ్ళిపోయింది.

అదే కేసెట్ పెట్టాను. వికారపు గొంతు. ఇంగ్లీషు పాటలా మ్యూజిక్. కుర్రకారుకి ఈ పాటలు బాగా నచ్చినట్లున్నాయి. ఆ సంగీత దర్శకుడికి బాగా పేరొచ్చింది. ఈ మధ్యే ఏదో పత్రికలో అతని ఇంటర్వ్యూ చదివాను" "గాయకునికి కమ్మని గొంతు ఉండాలనేం లేదు" అని అతనన్నాడు. నేను ఆశ్చర్యపోయాను.

విసుగొచ్చి. ఆ కేసెట్ తీసేసి మరో కేసెట్ పెట్టాను. 'సడిసేయకే గాలి' పాట వింటూ కళ్ళు మూసుకున్నాను. మనసుకేదో హాయి.

"ఏం నాన్నా పిలిచావట".

ఉలిక్కిపడి కళ్ళు తెరచి విజయ్ వంక చూశాను. జీన్స్‌పేంట్. టక్ చేసిన పెద్దపెద్ద పువ్వుల లూజ్ షర్ట్. ముఖాన కొద్దిగా చెమట.

"నేను ఎన్నో రికార్డింగ్ సెంటర్లు తిరిగి తిరిగి చేయించుకున్న పాటలు చెరిపేసి, ఇంకేవో పాటలు ఎందుకు చేయించావ్?"

"ఎప్పుడోకానీ ఆ పాటలు వినవుగా. అయినా, అవన్నీ ముసురు పాటలే కదా అని నాకిష్టమైనవి చేయించుకున్నాను".

"అలా చేయించేముందు నాకెందుకు చెప్పలేదు" గట్టిగా అడిగాను.

మౌనంగా ఉండిపోయాడు.

"మాట్లాడవేం?"

"నీకు చెప్పాలని తోచలేదు" అన్నాడు విజయ్ నెమ్మదిగా.

"ఇంకెప్పుడూ అలా చేయకు" నేనూ నెమ్మదిగా అని కళ్ళు మూసుకున్నాను.

విజయ్ గొంతులో బెరుకు లేదు. అదే వయసులో నేను పెద్దవాళ్ళతో భయం భయంగా మాట్లాడేవాణ్ణి. అయితే, నేను పెరిగిన వాతావరణం వేరు. వాడు పెరుగుతున్న వాతావరణం వేరు.నేను కాలేజీలో చేరేదాకా రోజూ దినపత్రిక చదివే అవకాశం నాకు లేదు. వాడికి ఫస్ట్ స్టాండర్డ్ నుంచే ఆ అవకాశం వుంది. నేను ఉద్యోగంలో చేరే వరకూ నాకు రోజూ టి.వి. చూసే వీలు లేదు. వాడికి చిన్నప్పటి నుంచే ఉంది.

అందుకే కాబోలు ఒకనాడు,

"నాన్నా సిగరెట్లు మానెయ్యకూడదూ. కేన్సర్ వంటి వ్యాధులొస్తాయట" అన్నాడు విజయ్.

"ప్రయత్నిస్తాను" అన్నాను తెల్లబోయి చూస్తూ.

నేను సిగరెట్లు చిన్నతనంలోనే సరదాకి మొదలెట్టాను. అవి కాల్చడం తప్పని మాత్రమే అప్పట్లో నాకు తెలుసు. ఆరోగ్యానికి హానికరం అని తెలుసుకునేటప్పటికి పొగ తాగడం బాగా అలవాటయిపోయింది.

చాలా విషయాల్లో వాడి ప్రవర్తనలోనూ, అదే వయసులోని నా ప్రవర్తనలోనూ తేడా కనిపిస్తోంది.

❀❀❀

కాన్వెంట్‌లో చేరిన కొత్తలో ఒకనాడు "డాడీగారూ" అంటూ పిలిచాడు విజయ్.

"అదేం పిలుపురా. నాన్నగారూకు బదులా" అన్నాను నవ్వుతూ.

అవునన్నట్టు తలూపి, కళ్లతో లోపలి గదిలోకి చూసి, నా వైపు తిరిగాడు.

"అలా పిలవమని అమ్మ చెప్పిందా" అని అడిగాను.

లేదన్నట్టు తల అడ్డంగా ఊపి, "నాన్నమ్మ" అన్నాడు నెమ్మదిగా.

"నాన్న అనీ, అమ్మ అనీ పిలు చాలు" అన్నాను.

అంతలో మేం ఉన్న గదిలోకి వస్తున్న మా అమ్మగార్ని చూసి, నాకు కన్నుకొట్టి, "ఒరే నాన్నా, టి.వి. పెట్టు" అన్నాడు గట్టిగా.

"వెధవ కానా" అంటూ విజయ్‌ను దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకున్నాను.

"చాలా బావుంది. వాడు అలా అన్నప్పుడు రెండు తగలనియ్యొద్దూ" అంటున్న నాన్నమ్మను వెక్కిరించి వీథిలోకి పారిపోయాడు.

"నిన్ను ఏడిపించడానికే అలా అన్నాడులే" అని మా అమ్మ గారికి చెప్పాను.

"భయం భక్తీ లేకుండా పెంచుతున్నావ్" అంటూ చిరాకు పడ్డారామె.

విజయ్ తనకు నచ్చినప్పుడు చదివేవాడు. నచ్చనప్పుడు ఎంత చెప్పినా చదివేవాడు కాదు.

"ఇవేళ్టి హోం వర్కు చేశావా?" అడిగాను ఓ సాయంత్రం.

"చెయ్యలేదు".

"ఏం"

"నాకిష్టం లేదు నాన్నా ఆడుకుంటాను" అంటూ బయటకు పరుగెత్తాడు.

వాడంత స్పష్టంగా చెప్పినందుకు సంతోషించాలో, మొండివాడుగా తయారవు తాడేమోనని భయపడాలో నాకర్థం కాలేదు.

పరీక్షలో విజయ్‌కు మంచి మార్కులే వచ్చేవి. నేనూ, మా ఆవిడా పుస్తకాల పురుగులం కావడంతో వాడు క్లాసు పుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలూ చదివేవాడు. హాస్య రచనలంటే వాడికి మీరీ ఇష్టం. తనకు నచ్చిన జోకులు చెప్పేవాడు. ప్రాక్టికల్ జోకులు కూడా వేసేవాడు.

ఒకనాడు నేను పడగ్గదిలోంచి వస్తుండగా గుమ్మకమ్మి మోచేతికి తగిలింది. వెంటనే 'అమ్మా' అన్నాను బాధతో. పక్కగదిలోంచి గబుక్కున వచ్చి.

"నాన్నా అమ్మకానీ కొట్టిందా" అన్నాడు విజయ్ చిలిపిగా ముఖంపెట్టి. అంత బాధలోనూ నవ్వేశాను. వాడూ నవ్వేశాడు.

"ఏవిటి, ఇద్దరూ అంతలా నవ్వేస్తున్నారు" అంటూ మా ఆవిడ వచ్చింది.

చెప్పేను. తనూ ఒకటే నవ్వు.

కాన్వెంట్ పిల్లల్ని హైదరాబాద్, బొంబాయి తీసుకువెళ్తున్నారనీ, తనూ వెళ్తాననీ విజయ్ అంటే "సరే" అన్నాను. వారం రోజులపాటు హైదరాబాద్, బొంబాయిలతోపాటు, ఆ దారిలోని ముఖ్యమైన ప్రదేశాలన్నీ చూసి వచ్చాడు. పైఖర్చుల కోసం వాడికిచ్చిన డబ్బుల్లోంచి కొంత మిగిల్చి నాకు మనీ పర్సు, నాన్నమ్మకు షిర్డీ సాయిబాబా విగ్రహం, అమ్మకు నగిషీ చెప్పుల్ తెచ్చాడు. తను చూసిన వాటి గురించి ఒకటే కబుర్లు. ఆ ప్రాంతాలెప్పుడూ చూడకపోవడంతో నేనూ ఆసక్తిగా విని ఆనందించాను.

టెన్త్‌లో విజయ్‌కు ఎనభై శాతం పైగా మార్కులొచ్చాయి. లెక్కల్లో తొంభై వచ్చాయి. ఇంటర్‌లో ఎంపిసి తీసుకోమన్నాను.

"నాకు లెక్కలంటే ఇష్టం లేదు. హెచ్.ఇ.సి. తీసుకుంటాను" అన్నాడు.

ఎం.పి.సి. తీసుకుంటే ఏయే పై చదువుల కెళ్ళవచ్చో చెప్పాను. నా ఫ్రెండ్స్ కూడా మా ఇంటికి వచ్చినప్పుడు నాలాగే చెప్పారు. విజయ్ ఎం.పి.సి. తీసుకున్నాడు. ట్యూషన్ కూడా పెట్టించాను.

కొన్నాళ్ళ తర్వాత మా ఊరికి రాత్రి సినిమా వస్తే వెళ్లేం. అందులో రేవతి "మేథ్స్ పరమ బోర్" అనగానే మావాడు నా భుజం తట్టి ఫకాలున నవ్వేడు. నవ్వడానికందులో జోకేం ఉందనుకున్నాను.

ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు పదిహేను రోజుల్లో జరుగుతాయనగా, "నాన్నా మేథమేటిక్స్‌లో పోతుంది. ముందే చెబుతున్నా" అన్నాడు విజయ్.

నేను తెల్లబోయాను. "అదేంటీ, ట్యూషన్‌కి కూడా వెళుతున్నావుగా".

"వెళ్తే మాత్రం బుర్రకెక్కొద్దూ. ముందే చెప్పాను కదా నా కిష్టం లేదనీ" అన్నాడు.

నాకేం చేయాలో పాలుపోలేదు.

"పోనీ, ఈ పదిహేను రోజులన్నా కష్టపడి చదువు. పాస్ మార్కులైనా తెచ్చుకో. డిగ్రీలో గ్రూపు మార్చుకుందువుగాని, లేకపోతే ఒక సంవత్సరం వృథా అవుతుంది" అన్నాను నచ్చచెప్తున్న ధోరణిలో.

తలూపాడు.

విజయ్ అన్నట్టే మేథమేటిక్స్‌లో పోయింది. పరీక్ష పోయినందుకు వాడిలో కొంచెం కూడా విచారం కనిపించలేదు.

డిగ్రీలో తనకిష్టమైన గ్రూప్ తీసుకున్నాడు. మా స్కూలు నుండి ఎస్.ఎస్.ఎల్.సి. పరీక్షకు అరవై మంది హాజరైతే, పదహారు మందిమే పాసయ్యాం. అంటే, నేనూ మంచి విద్యార్థి కిందే లెక్క. పి.యు.సి.లో కామర్స్ గ్రూప్ తీసుకోమని, తర్వాత బి.కాం. చదివితే బ్యాంకుల్లో ఉద్యోగాలొస్తాయనీ కొందరు చెబితే నేనలాగే చేశాను. ఎకనామిక్స్ అర్థమైనా, అందులోని టెర్మినాలజీ నా బుర్రకెక్కేది కాదు. అయినా, ఎలాగో కష్టపడి పాసయ్యాను. బ్యాంకులో ఉద్యోగం రాలేదు. అది వేరే సంగతి.

❀❀❀

డిగ్రీలో చేరాక విజయ్ వ్యాయామశాలకు వెళ్ళడం మొదలెట్టాడు. 'తిండి కలిగితే కండ కలదోయ్, కండ కలిగినవాడే మనిషోయ్' అన్న గురజాడ గేయాన్ని పూర్తిగా ఒప్పుకుంటాను, కానీ కండలు పెంచడమే ధ్యేయంగా పెట్టుకునే వాళ్ళంటే నాకు సదభిప్రాయం లేదు. నాకు తెలిసిన అలాంటి వాళ్ళు వృద్ధిలోకి రాకపోవడమే అందుకు కారణం అనుకుంటాను.

వారానికో, పది రోజులకో ఇంగ్లీషు సినిమా కెళ్తాడు. తెలుగు సినిమా అయితే, "ఫలానా సినిమా సరదాగా వుంటుంది వెళ్దామా" అంటాడు. ఇంగ్లీషు సినిమాకయితే, తను వెళ్తానన్న రోజునే చూసేస్తాడు. ఒకోసారి తెలుగు సినిమాకు ఫలానా రోజున వెళ్దామని నేనంటే, "నేను ఇవేళ చూస్తాను. మీరు తర్వాత వెళ్లండి" అంటాడు.

విజయ్ అలాగన్న రోజున నేను ఆలోచనలో పడతాను. నలుగురం కలిసి వెళ్తామని నేను అనుకుంటాను. అలా వెళ్తే అంతా కలిసి వెళ్లిన తృప్తి వుంటుంది.

కానీ, విజయ్!

ఒంటెద్దు పోకడ వాడికొచ్చేస్తోందా?

"ఏంటో నాన్నా, నీదంతా విచిత్రం. ఒక సినిమా అంతా కలిసి చూసినా, విడిగా చూసినా అందులోని కథా, పాటలూ వగైరా ఏం మారవు కదా" అన్నాడు.

నేను మరీ సెంటిమెంటల్‌గా వుంటున్నానా? వాడు మరీ ప్రాక్టికల్ అవుతున్నాడా?

వేగం పెరిగిన ఈ పారిశ్రామిక యుగంలో సెంటిమెంట్‌కు స్థానం పోతోందా? ప్రాక్టికల్ కావడం అనివార్యమా? 'అవును' అనే జవాబు నాకు నచ్చడం లేదు. మనిషి ప్రాక్టికల్ అయిపోతే, స్పందనలు పోవా? స్పందనే లేకపోతే, ఇక... ఆలోచనలు ఓ పట్టాన తెగవు. నేను సెంటిమెంటల్‌గా ఉంటూ ఆనందించిన సందర్భాలూ ఉన్నాయి. విచారించిన సందర్భాలూ ఉన్నాయి. నష్టపోయినప్పుడు ప్రాక్టికల్‌గా వుండివుంటే

బావుండేదని అనుకున్న సందర్భాలూ లేకపోలేదు.

విజయ్ ఆ మధ్య తెల్లవారుజామున లేచి చదివేవాడు. ఈ మధ్య కూడా తెల్లవారు జామునే లేస్తున్నాడు. కానీ చదవడం లేదు. వ్యాయామశాలకు వెళ్తున్నాడు.

❀❀❀

ఓ ఆదివారం నాడు సినిమా కెళ్తానన్నాడు విజయ్. ఏం సినిమా అంటే చెప్పాడు.

"ఓహో! అదా అన్నీ గోలపాటలే అనుకుంటాను".

"నా క్లాస్‌మేట్సంతా చూసేశారు. బావుందట".

సరేనన్నాను. ఆ తర్వాత ఏవో ఆఫీసు పనులతో బిజీగా వుండి ఆ సినిమా సంగతి మరిచిపోయాను. కొన్ని రోజుల తర్వాత గుర్తొచ్చి.

"మొన్న చూసిన సినిమా ఎలా వుంది" అడిగాను.

"బాగోలేదు".

"అదేంటి".

'పాటలతో సహా సినిమా గోలగోలగా వుంది"

"మరి చికుబుకు రైలే పాట నీకిష్టమే కదా."

"అప్పట్లో అది వెరైటీగా వుంది. ఇందులో అన్నీ అలాగే ఉండడంతో నాకు నచ్చలేదు" అన్నాడు.

విజయ్ అభిరుచిలో వస్తున్న మార్పు నాకు సంతోషం కలిగించింది.

తర్వాత ఆఫీసు పనిమీద ఊరికెళ్లి పదిరోజులకు ఇంటికొచ్చాను. హాల్లో అడుగు పెట్టేసరికి విజయ్ గదిలోంచి 'స్వామియే శరణం అయ్యప్పా' పాట వినిపించింది. నాకు మతిపోయినంత పనైంది.

"నాన్నా ఆలస్యమైందేం? మొన్ననే వస్తావనుకున్నాం' అంటూ పలకరించాడు విజయ్ తన గదిలోంచి వచ్చి.

"హెడ్డాఫీసులో పనులు నిన్నటికి కానీ పూర్తికాలేదు" అని బాత్‌రూం కెళ్ళి స్నానం చేసి వచ్చాను.

విజయ్ కాలేజీ విషయాలు చెబుతూంటే వింటూ ఆ రోజు పేపర్ తిరగేశాను.

అయ్యప్ప పాటలు వినిపిస్తూనే వున్నాయి.

"ఈ కేసెట్ ఎక్కడిది? నీ ఫ్రెండ్స్ దగ్గర నుంచి తెచ్చావా?"

"లేదు. చికుబుకు రైలే పాటలు చెరిపించి వీటిని చేయించాను" అన్నాడు.

నేనేమీ మాట్లాడకుండా పేపరు చదువుతూ కూర్చున్నాను. నిజానికి పేపరు కళ్లముందు పెట్టుకుని ఆలోచిస్తున్నాను. నేను దేవుణ్ణి నమ్మను. గుడికెళ్ళను. ఆ సంగతి వాడికి తెలుసు.

"తెలుగునాట భక్తిరసం తెప్పలుగా పారుతోంది. డ్రైయినేజీ స్కీము లేక డేంజరుగా మారుతోంది" గేయం విజయ్‌కు వచ్చు.

నాకు మంచి అని తోచింది ఎప్పటికప్పుడు వాడికి చెబుతూనే వున్నాను. చెప్పిందే మళ్ళీమళ్ళీ చెప్పడం అంటే నా అభిప్రాయాన్ని వాడిమీద రుద్దడం అవుతుంది.

ఇంకో రోజున టి.వీ.లో సినిమా చూస్తున్నాం. గుండమ్మ కథ.

"ఇప్పటి సినిమాలతో పోలిస్తే ఈ సినిమా చాలా బావుంది. పాటలు ఎంతో బావున్నాయి. మాటలు కూడా హాస్యంగా ఉన్నాయి" అన్నాడు విజయ్.

నేను మనసులో మెచ్చుకుంటూ విన్నాను.

❀❀❀

పాటల్లో హీరోహీరోయిన్లను ఇంచక్కా క్లోజప్‌లో చూపించారు. ఇప్పటి పాటల్లో అంతగా క్లోజప్ షాట్లే ఉండవు" అన్నాడు మళ్ళీ తనే.

విజయ్ మాటలు వింటూ అనుభవం కన్నా మించిన పాఠం ఉండదేమో అనుకున్నాను.

నాలుగు రోజుల తర్వాత నేను నిద్రలేచేటప్పటికి విజయ్ నల్లని డ్రెస్‌లో కనిపించాడు.

"నా పాకెట్ మనీలో దాచుకున్న దాంతో వీటిని కుట్టించాను. అయ్యప్ప మాల ధరించాను" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

నాకు చాలా కోపం వచ్చింది. నిగ్రహించుకున్నాను. నేను తలెత్తి చూసేటప్పటికి వాడు తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఆ రోజంతా నేను చాలా మధనపడ్డాను. వీడిలా తయారవుతున్నాడేవిటనుకున్నాను.

మా ఆవిడతో ఆ మాటే అన్నాను.

"పోనీలేద్దురూ చాలా మంది వేసుకుంటున్నారుగా" అంది.

"నీ సపోర్టు కూడా ఉందన్నమాట" అని చిరాకుపడుతూ బాత్‌రూం కెళ్ళాను.

నేను ఆఫీసుకెళ్తుంటే, తనూ కాలేజీకి తయారవుతూ,

"నాన్నా, ఈ దీక్ష ముప్ఫై రోజులు. అదయిన వెంటనే శబరిమలై వెళ్ళాలి. ఎందుకయినా మంచిదని ముందే చెబుతున్నా" అన్నాడు విజయ్.

"అదేదో దీక్ష తీసుకునే ముందే చెప్పాల్సింది" అనబోయి, నిభాయించుకుని ఆఫీసుకెళ్ళిపోయాను.

ఆఫీసులో కూడా విజయ్ గురించే ఆలోచనలు.

'ఏవిటీ, వీడి సొంత నిర్ణయాలు? డబ్బివ్వకపోతే సరి' అనుకున్నాడు.

నేనివ్వకపోతే వాళ్ళమ్మను అడుగుతాడు. ఆమె ఇవ్వనంటే నాన్నమ్మ దగ్గరకెళ్ళి అడుగుతాడు. అంచేత నేనే ఇస్తే మంచిది.

విజయ్ రోజూ తెల్లవారుజామున లేచి బుద్ధిగా చదువుకుంటున్నాడు. నెలరోజులు ఇట్టే గడిచిపోయాయి. నా దగ్గర డబ్బులు తీసుకుని విజయ్ శబరిమలై వెళ్ళి వచ్చాడు.

నాకు వెరైటీగా ఉన్న పెన్ను తెచ్చాడు. (నాకు పెన్నుల పిచ్చి వుందని వాడికి బాగా తెలుసు) మా ఆవిడకు హాండ్ బేగ్ తెచ్చాడు. (తల్లి సరదాలూ వాడికి బాగానే తెలుసు).

"అమ్మా, వెళ్లేటప్పుడు రైలు ప్రయాణం బాగానే జరిగింది. వచ్చేటప్పుడు మాత్రం కంపార్ట్‌మెంటంతా ఒకటే మందు కంపు. భరించలేకపోయాననుకో".

"ఏం మందులురా అవి?"

"అమ్మలగన్న అమ్మ మాయమ్మ అమాయకపు బొమ్మ" అని పాడుతూ నవ్వేసి.

"బ్రాందీ, విస్కీల కంపు. దీక్షలో మందు ముట్టకూడదుగా. ఆ ముప్పై రోజుల మందూ ఒక్కనాడే కొట్టేసినట్టున్నారు" అన్నాడు విజయ్ ముఖం అదోలాపెట్టి.

మా ఆవిడ "అలాగా" అంటూ నవ్వేసింది. నేను విననట్టుగా కూర్చున్నాను.

"నాన్నకు నా మీదింకా కోపం పోయినట్టు లేదు" అన్నాడు అమ్మతో చెబుతున్నట్టుగా చెబుతూ, నా వంక చూస్తూ...

నేనేం మాట్లాడలేదు.

"నాన్నా, నీకో నిజం చెప్పేస్తా. నేనా దీక్ష భక్తితో తీసుకోలేదు. శబరిమలైలో కనిపించే ఆ దివ్యజ్యోతి వెనుక ఏ మహత్యం లేదనీ, అక్కడి ప్రభుత్వం అజమాయిషీలోనే దాన్ని వెలిగిస్తున్నారనీ నేనెప్పుడో పత్రికల్లో చదివాను. కేరళ చూద్దామనుకున్నాను. ఉట్టినే చూడ్డానికి వెళ్తానంటే నువ్వు డబ్బులివ్వవేమోనని ఆ ఎత్తు ఎత్తాను" అన్నాడు విజయ్.

"మరి ఆ పాటల కేసెట్?"

"గ్రౌండ్ ప్రిపేర్ చేశాను"

వాడి మాటలకి దిగ్భ్రాంతి చెందాను. కొంతసేపటిదాకా నా నోటివెంట మాట రాలేదు.

విజయ్ వంక చూశాను.

వాడి ముఖంలో నిజాయితీతో కూడిన చిర్నవ్వు.

వాడు తన గదిలోకి వెళ్ళి బొంబాయి సినిమా పాటల్ని పెట్టుకున్నాడు.

నేను చాలా సేపు ఆలోచిస్తూ కూర్చున్నాను. విజయ్ గురించి ఆందోళన పడక్కర్లేదనిపించింది.

*జూన్ 6-20, 1995, ఇండియా టుడే*